అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే 2817 కొత్త ఓట్ల నమోదు

ప్రస్తుతం నియోజకవర్గంలో 279924 మంది ఓటర్లు

వేగవంతంగా ఓటర్ స్లిప్‌ల పంపిణీ ప్రక్రియ



అంబర్‌పేటలో పెరిగిన ఓటర్లు

అంబర్‌పేట: అంబర్‌పేట నియోజకవర్గంలో ఓటర్లు స్వల్పంగా పెరిగారు. గత అసెంబ్లీ ఎన్నికల అనంతరం చేపట్టిన ఓటరు నమోదు కార్యక్రమంతో ఓటర్ల సంఖ్య పెరిగింది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో 2,77,107 ఓటర్లు ఉండగా ప్రస్తుతం 2,817 పెరిగి తాజాగా ఓటర్ల సంఖ్య 2,79,924 ఓటర్లు ఉన్నారు. సుమారు 4 నెలల కాలంలో 2817 కొత్త ఓటర్లు అంబర్‌పేటలో నమోదు అయ్యారు. ఓటర్ జాబితాపై జీహెచ్‌ఎంసీ సర్కిల్‌-16 అధికారులు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. అంతేకాకుండా వివిధ రాజకీయ పార్టీల నేతలతో ఓటరు జాబితా సవరణ, అభ్యంతరాలపై ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి సూచనలు తీసుకున్నారు. పోలింగ్ కేంద్రాల్లో సైతం అందుబాటులో కొత్త ఓటర్ నమోదు ప్రక్రియను చేపట్టారు.

మొత్తం ఓటర్లు:	279924
పురుషులు:	141080
మహిళలు:	138832
ఇతరులు:	12
పోలింగ్ కేంద్రాలు:	103
పోలింగ్ బూత్‌లు:	236

ఓటర్ స్లిప్‌ల పంపిణీ...

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ ప్రక్రియను అధికార యంత్రాంగం వేగవంతం చేసింది. అందులో భాగంగా అంబర్‌పేట నియోజకవర్గంలో ఓటర్లకు ఇంటింటికీ వెళ్లి ఓటరు స్లిప్‌లను పంపిణీ చేస్తున్నారు. నియోజకవర్గంలో ఉన్న ఐదు డివిజన్లలో సంబంధిత బూత్ స్థాయి అధికారులు పటిష్టంగా ఓటరు స్లిప్‌లను ఓటర్లకు అందజేస్తున్నారు. బస్తీలు, కాలనీల్లో ఓటరు జాబితా ఆధారంగా స్లిప్‌ల పంపిణీ కార్యక్రమాన్ని వేగవంతం చేసింది. ఓటు వేయడానికి అధికార యంత్రంగం అందించే స్లిప్‌లే ప్రధానం. ఓటర్లకు స్లిప్‌లు అందకపోతే స్థానిక జీహెచ్‌ఎంసీ సిబ్బందిని సంప్రదిస్తే అందించేందుకు ఏర్పాట్లు చేస్తామని ఏఆర్‌వో మారుతీదివాకర్ తెలిపారు.

నల్లకుంటలో కిషన్‌రెడ్డి ఎన్నికల మహా ప్రచార యాత్ర



నల్లకుంటలో ప్రచార రథంపై నుంచి ప్రజలకు అభివాదం చేస్తున్న కిషన్‌రెడ్డి

నల్లకుంట: ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం సాయంత్రం కేంద్ర మంత్రి, సికింద్రాబాద్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి జి.కిషన్ రెడ్డి నల్లకుంటలో ఎన్నికల మహా ప్రచారయాత్ర చేపట్టారు. చే నంబర్ చౌరస్తా, తిలక్‌నగర్ మెయిన్ రోడ్డు, నల్లకుంట ఫీవర్ ఆస్పత్రి చౌరస్తా, రత్నానగర్, సత్యానగర్ మీదుగా కాచిగూడ వైపు సాగింది పాదయాత్ర. ఈ సందర్భంగా స్థానికులు అడుగడుగునా కిషన్‌రెడ్డికి ఘనంగా స్వాగతం పలికారు. ఇళ్ల దాబాలు, దుకాణాల ముందు, రోడ్డుకు ఇరువైపులా నిలుచున్న ప్రజలకు అభివాదం చేస్తూ కిషన్‌రెడ్డి ముందుకు సాగారు. ఈ సందర్భంగా కళాకారుల నృత్యాలు, మహిళల బోనాలు, కోలాటం ఆటపాటలతో ఉత్సాహంగా సాగింది. బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు, స్థానిక కార్పొరేటర్ అమృత, మాజీ కార్పొరేటర్ వనం రమేష్, బీజేపీ నాయకులు ఎం.బి. కిషోర్‌కుమార్, లక్ష్మణ్ కుమార్, నర్సింగ్ రావు, ఎన్.మహేష్, సురేష్ యాదవ్, కేజే బాబు, ఎస్. రాంజగదీష్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు రాంనగర్‌లో కేటీఆర్ రోడ్‌షో

ముషీరాబాద్: బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సికింద్రాబాద్ పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్ విజయాన్ని కాంక్షిస్తు ఆదివారం సాయంత్రం 5 గంటలకు రాంనగర్ చౌరస్తాలో రోడ్‌షో నిర్వహించనున్నట్లు మీడియా ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్ తెలిపారు. కార్యక్రమానికి అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులను కోరారు.

కలుషిత నీటి సమస్యను పరిష్కరించండి

అంబర్‌పేట: నల్లాల్లో కలుషిత నీటి సరఫరా సమస్య తలెత్తకుండా అధికారులు ముందుస్తు చర్యలు తీసుకోవాలని బాగ్ అంబర్‌పేట కార్పొరేటర్ బి.పద్మావెంకట్‌రెడ్డి తెలిపారు. శనివారం మహంకాళీ ఆలయం వెనుక ఉన్న ప్రాంతంలో కొంతకాలంగా కలుషిత నీరు సరఫరా అవుతున్నట్లు స్థానికుల నుంచి ఫిర్యాదులు వచ్చాయి. దీంతో ఆమె జలమండలి అధికారులతో కలిసి ఆ ప్రాంతంలో పర్యటించారు.


పండుటాకులకు ఇంటి వద్దే ఓటింగ్



ఇంటి వద్దే ఓటు హక్కు వినియోగించుకున్న 94 ఏళ్ల సీత



అడిక్‌మెట్ డివిజన్ లలితానగర్ 90 ఏళ్ల శ్యామ్‌ప్రకాష్‌రావు



డాక్టర్ జోగేశ్వర్‌రావు

ముషీరాబాద్: ఎన్నికల సంఘం మొదటిసారిగా 80 ఏళ్లు దాటిన వయోవృద్ధులకు ఇంటి వద్దే ఓటు వేసే అవకాశాన్ని మొదటిసారి కల్పించింది. దీంతో ఈ నెల 13వ తేదీన జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు హక్కులో అడిక్‌మెట్ డివిజన్‌లో సుమారు 10 మంది శనివారం తమ ఓటు హక్కును ఉపయోగించుకున్నారు. ఎన్నికల అధికారులు ఇంటి వద్దకే వచ్చి పోలింగ్ బూత్ మాదిరిగా ఏర్పాటు చేసి రహస్యంగా ఓటు హక్కును వినియోగించుకునే విధంగా చర్యలు తీసుకున్నారు. అడిక్‌మెట్ డివిజన్‌లోని 94 సంవత్సరాల పి.సీత, కె.శ్యామ్‌ప్రకాష్‌రావు, డాక్టర్ ఆర్.జోగేశ్వర్‌రావుతో పాటు మరికొంత మంది ఈ ఓటు హక్కును వినియోగించుకున్న వారిలో ఉన్నారు.



అంబర్‌పేటలో ఇంటివద్దే ఓటు వేస్తున్న వృద్ధుడు.. చిత్రంలో ఏఆర్‌వో మారూతీదివాకర్

క్రమశిక్షణతో చదివితే ఉన్నత శిఖరాలు



ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థినులను సత్కరిస్తున్న చైర్మన్ పరమేశ్వర్

చిక్కడపల్లి: త్యాగరాయ గానసభలో జాహ్నవి ఉమెన్స్, జూనియర్, డిగ్రీ, పీజీ కళాశాలల వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు నృత్య, సాంస్కృతిక ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. ర్యాంప్‌వాక్ ఆకర్షణీయంగా సాగింది. ఈ సందర్భంగా జాహ్నవి విద్యా సంస్థల చైర్మన్ ఎ.పరమేశ్వర్ మాట్లాడుతూ... క్రమశిక్షణతో చదివితే ఉన్నత లక్ష్యాలను చేరుకోవచ్చన్నారు. అనంతరం ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాలలో ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులను సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల వైస్‌చైర్‌పర్సన్ ఎ.లక్ష్మీ, ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

మోదీ మూడోసారి ప్రధాని కావడం ఖాయం

నల్లకుంట: నరేంద్రమోదీ మూడోసారి ప్రధాని కావడాన్ని ఏ శక్తీ అడ్డుకోలేదని బీజేపీ మైనార్టీ మోర్చా జాతీయ అధ్యక్షుడు జమాల్ సిద్దిఖీ ధీమా వ్యక్తం చేశారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం జమాల్ సిద్దిఖీ హైదరాబాద్‌కు వచ్చారు. ఈ సందర్భంగా బీజేపీ మైనార్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు అఫ్సర్‌పాషా, జాతీయ కార్యవర్గ సభ్యురాలు షబానా మోమిన్, మీడియా కన్వీనర్ ఎం. ఐజాక్ రాజ్ తదితరులు శంషాబాద్ విమానాశ్రయంలో జమాల్ సిద్దిఖీని శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జమాల్ సిద్దికి మాట్లాడుతూ... హైదరాబాద్ పాత బస్తీలో ఏర్పాటు చేసిన మహిళా సమ్మేళనంలో పాల్గొనేందుకు వచ్చానని తెలిపారు. హైదరాబాద్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి మాధవీలత గెలుపు ఖాయమన్నారు. మైనార్టీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ బాబా, కోశాధికారి డాక్టర్ రహమతుల్లా, మైనార్టీ మోర్చా సోషల్ మీడియా జాతీయ ఇంఛార్జి జస్వంత్ జైన్, సమీ, రిదా షాజహాన్ తదితరులు పాల్గొన్నారు.

పత్రికలు ప్రజాస్వామానికి పట్టుకొమ్మలు

ప్రముఖ సినీ హీరో సుమన్

చిక్కడపల్లి: పత్రికలు ప్రజాస్వామానికి పట్టుకొమ్మలని ప్రముఖ సినీ హీరో సుమన్ తల్వార్ అన్నారు. ప్రపంచ పత్రికా దినోత్సవం సందర్భంగా శనివారం త్యాగరాయ గానసభలో డాక్టర్ కొండూరు హరినారాయణరెడ్డి చారిటబుల్ ట్రస్ట్, పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్‌ల సంయుక్తాధ్వర్యంలో పత్రికా ప్రాముఖ్యత అంశంపై కవిసమ్మేళనం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న సుమన్ మాట్లాడుతూ... పత్రికా స్వేచ్ఛకు సంబంధించిన ప్రాథమిక సూత్రాలపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. పత్రికా స్వేచ్ఛపై జరిగే దాడులను అరికట్టాలని అన్నారు. తొలుత పత్రికా ప్రాముఖ్యత అనే అశంపై కవిసమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా ఎంపిక చేసిన పలువురు ఉత్తమ జర్నలిస్టు అవార్డు గ్రహీతలు చిలుకూరి అఖిలేష్(సాక్షి), సైదులు, ఆర్.వి.రమణ(ప్రజాశక్తి), ఎం.శ్రీనివాస్(వార్త), టి.కె.చారి(సూర్య), ఉదయ్‌గౌడ్(ఈనాడు), కె.శ్రీనివాస్(నమస్తే తెలంగాణ) వోలేటి శ్రీనివాసాచార్య, రాజనాల సత్య(యూట్యూబ్) జర్నలిస్టులకు పురస్కారాలను ప్రదానం చేసి సన్మానించారు. కార్యక్రమంలో విశ్రాంత జడ్జి బూర్గుల మధుసూదన్, సినీ దర్శకులు మహేష్‌చంద్ర, కూచిపూడి నాట్యగురువు ఎస్పీ భారతి, ప్రముఖులు కోడూరు హరినారాయణరెడ్డి, కె.మురళీమోహన్‌రాజు, ఎం.రామచందర్‌రాజు, వై.చంద్రశేఖర్‌రెడ్డి, డాక్టర్ రాధా కుసుమ పాల్గొన్నారు.



సినీ హీరో సుమన్‌తో సన్మాన గ్రహీతలు

ముషీరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన





ఎన్నికల ప్రచారంలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శనివారం రాత్రి ముషీరాబాద్ నియోజకవర్గం పరిధిలో రోడ్‌షో నిర్వహించారు. ముషీరాబాద్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో సీఎం ప్రసంగించారు. అనంతరం ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. కార్యక్రమంలో సికింద్రాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్, నేతలు అంజన్‌కుమార్‌యాదవ్, అనిల్‌కుమార్ యాదవ్, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, అరవింద్‌కుమార్‌యాదవ్ పాల్గొన్నారు.

– ముషీరాబాద్

సికింద్రాబాద్‌లో చరిత్రను తిరిగరాస్తాం

బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్

ముషీరాబాద్: సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో భారీ మెజార్టీతో గెలిచి చరిత్రను తిరిగరాస్తామని బీఆర్‌ఎస్ అభ్యర్థి టి.పద్మారావుగౌడ్ ధీమా వ్యక్తం చేశారు. శనివారం ముషీరాబాద్ డివిజన్‌లోని బాపూజీనగర్ నుంచి ఎన్నికల ప్రచారాన్ని ఎమ్మెల్యే ముఠా గోపాల్‌తో కలిసి పద్మారావుగౌడ్ ప్రారంభించారు. స్థానికంగా ఉన్న ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్‌కు ఓటు వేస్తే వృథా అవుతుందన్నారు. బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డి ఐదేళ్లు అందుబాటులో లేరని, ఆయనకు మరోసారి ఓటు వేస్తే మరో ఐదేళ్లు కనిపించరని పేర్కొన్నారు. 40 సంవత్సరాలుగా ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ వారి కష్టసుఖాలలో భాగస్వామిగా ఉన్నానని తెలిపారు. ఎమ్మెల్యే ముఠా గోపాల్ మాట్లాడుతూ... మచ్చలేని నాయకుడు పద్మారావుగౌడ్ అని అన్నారు. బీఆర్‌ఎస్ గ్రేట్ యువజన కమిటీ సీనియర్ నాయకులు ముఠా జైసింహ, ముషీరాబాద్ ఎన్నికల ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు ఎడ్ల హరిబాబుయాదవ్, రాజీవ్‌సాగర్, టి.సోమన్, మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.